



వ్య.కా.స అఖిలభారత సమావేశాలకు కడపకు విచ్చేసిన కేరళ ఎంపీ శివదాసన్‌కు, కేరళ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ చంద్రన్‌కు స్వాగతం పలుకుతున్న సిపిఎం వైఎస్ఆర్ కడప జిల్లా నాయకులు

కడప నగరం..అరుణమయం

నేటి నుంచి కడపలో వ్య.కా. స జాతీయ సమావేశాలు

నేడు ర్యాలీ, బహిరంగసభ

22 రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హాజరు



అంబేద్కర్ సర్కిల్ వద్ద కట్టిన తోరణాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈమేరకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న జాతీయ సమావేశాల షెడ్యూల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులోభాగంగా కడప నగరంలోని ప్రధాన కూడళ్లు అయిన సెవన్‌రోడ్స్, కోటిరెడ్డి, అంబేద్కర్ సర్కిళ్లు, రహదారులలలో ఎర్రజెండాలు, తోరణాలతో అరుణమయం చేసింది. కడపలో తొలిసారిగా నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలకు దేశంలోని 22 రాష్ట్రాలకు చెందిన 200 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. ముఖ్య అతిథులుగా కేరళ లెఫ్ట్‌ఫ్రంట్ నాయకులు మాజీ ఎంపీ విజయ రాఘవన్, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ నాయకులు విక్రమ్‌సింగ్, విజూ కృష్ణణ్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జాతీయ కన్వీనర్ లలితాబాలన్, వ్యవసాయ కార్మిక సంఘం కేరళ బోర్డు చైర్మన్ చంద్రన్ హాజరు కానున్నారు. అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌శివనాగరాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కా.బి.



తోరణాలు కడుతున్న నాయకులు

మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శివి.అన్వేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ హాజరు కానున్నారు. జాతీయ సమావేశాల నిర్వహణలో భాగంగా మొదటి రోజు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఆర్‌టిసి బస్టాండు నుంచి పాతబస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనుంది. 11 గంటలకు పాతబస్టాండ్ ఆవరణంలో బహిరంగసభ నిర్వహించనుంది. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు హరిత హోటల్‌లో దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన మహిళలతో దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చాగోష్ఠి నిర్వహించనున్నారు. రెండవ రోజు మంగళవారం ఉదయం 10 గంటలకు కేరళ లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీ విజయరాఘవన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్, జాతీయ సమావేశాలను ప్రారంభించనున్నారు. అనంతరం 11.30 గంటల వరకు సమావేశాలకు హాజరైన ప్రముఖుల పరిచయం, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ప్రసంగించనున్నారు. అనంతరం జాతీయ సమావేశాలు ప్రారంభం, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ కార్యదర్శి బి.వెంకట్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టనున్నా రు. మూడవ రోజు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సమావేశాలకు హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అనుభవాలను పంచుకోనున్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, డాక్టర్లు, మధ్యతరగతి ఉద్యోగులు, వామపక్ష అభిమానులు, ఇతర ప్రముఖులతో సెమినార్ నిర్వహణతో ముగియనుంది.



అరుణ తోరణాలతో ముస్తామైన కోటిరెడ్డి సర్కిల్



ఏర్పాట్లలో వ్య.కా.స సభ్యులు

వైద్యం వ్యాపారమైతే ప్రజల ప్రాణాలకు వెల కట్టడమే

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 15న మహా ధర్నా

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని, వైద్య వ్యాపారం అయితే ప్రజల ప్రాణాలకు ధర కట్టడమే అని వెంటనే వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. పట ్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మదనపల్లె అభివృద్ధి వేదిక, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ స్వాగతం పలుకగా, సిఐటియు జిల్లా కోశాధికారి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హరినాథ్ శర్మ అధ్యక్షత వహి ంచారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, యూటిఎఫ్ నాయకులు పురం వెంకటరమణ, బహు జనసేన శ్రీచందు, కాంగ్రెస్ రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశా లను ప్రభుత్వ ఆధీనంలో నిర్వహి ంచాలన్నారు. పిపిపి విధానం ద్వారా పేద, బడుగు బలహీన ప్రజానీకానికి వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని, పైగా బలహీన వర్గ విద్యార్థులకు రిజర్వేషన్ల ద్వారా పొందే హక్కు కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో వారికి కేటాయించడంతో పేద ప్రజలకు వైద్యం ఖరీదుగా మారిందన్నారు. అదే పద్ధతిలోనే ఇప్పుడు మదనపల్లి మెడికల్ కళాశాల కూడా పిపిపి విధానం ద్వారా నిర్మిస్తామని చెప్పడమంటే పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య చదువు దూరం చేయడమే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్‌లో మెడికల్ కళాశాల ఉండాలన్న దృష్టితో గత ప్రభుత్వం కళాశాలలను తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం ఆ మెడికల్ కళాశాలను పిపిపి విధానం ద్వారా ప్రయివేట్ వారికి అప్పజెప్పాలనుకోవడం దుర్మార్గమన్నారు. పులివెందుల తదితర కళాశాలలకు ఎంసిఐ అనుమతులు ఇస్తే



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

కూటమి ప్రభుత్వం వాటిని తోసిపుచ్చడం, మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయాలనుకోవడం వెనుక వాణిజ్య లాభం, కమీషన్ల కోసం తప్ప ప్రజలపై బాధ్యత అనే భావన లేదని చెప్పారు.. ఒక్కో మెడికల్ కళాశాల నుంచి రూ. 500 కోట్ల నుంచి రూ. 1,000 కోట్ల వరకు కమీషన్లు తీసుకునే ప్రక్రియలో భాగంగానే కూటమి సర్కార్ ప్రయివేటీకరణకు ఒడిగడుతోందన్నారు. వేలాది మంది పేద విద్యార్థులకు వైద్యవిద్య సీట్లు దక్కనీయకుండా వారి ఆశలపై నీళ్లు చల్లుతోందన్నారు. ఇక సామాన్యులు ఎంత కష్టపడి చదువుతున్నా, పోటీని ఎదుర్కోవడంలో సీటు దక్కక, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పైన్స్, రష్యా తదితర దేశాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు తమ పొలాలు, ఆస్తులను అమ్ముకుంటూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. ఆదోని, పెనుగొండ, పులివెందుల, మదనపల్లె వంటి రాయలసీమ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయాలని కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రాంతీయ వివక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇదంతా పక్కా ప్రణాళికతో, వైద్య విద్యను వ్యాపారంగా మలచాలన్న కుట్రేనని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణనే కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని వక్తలు డిమాండ్ చేశారు. లేకపోతే మదనపల్లి పట్టణంలో ప్రజలను, విద్యార్థులను, మేధావులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ మేరకు ఈనెల 15న మహాధర్నాకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోతే, ఇది విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చారిత్రక తప్పిదంగా నిలిచిపోతుందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు పురం వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ రెడ్డి సాహెబ్ బహుజన శ్రీచందు, రిటైర్డ్ ఎంఇఒ రెడ్డప్ప, రిటైర్డ్ హెచ్ఎం ఉత్తన్న, ప్రముఖ న్యాయవాది సోమశేఖర్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ రెడ్డప్ప, నాగరాజు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్తేజ, జిల్లా అధ్యక్షుడు సంపత్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రీద్, బన్నీ, సుల్తాన్, ప్రేమ్, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ రామకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర ప్రజా సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆదివారం అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 64, వికాస్ 53 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ముఖేష్ 4, రెడ్డి ప్రకాష్ 2, బాలాజీ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 33.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజ రెడ్డి 73 (నాటౌట్), రెడ్డి ప్రకాష్ 24 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ మూడు వికెట్లు తీసుకున్నాడు. కెఎస్ఆర్ క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 43.5 ఓవర్లలో 257 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని భరత రెడ్డి 66, ఎస్ఎండి ఆయుబ్ 51, శివ కేశవ 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ సాలుంకే అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. ఏకాక్షర్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 35.5 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టానికి 140 పరుగులు చేసింది

'మిట్స్'కు జాతీయస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దేశంలో అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసింది. ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో మిట్స్ కళాశాలకు 201-300 ర్యాంక్ లభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ వెల్లడించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్2025 కింద యూనివర్సిటీలు, కాలేజీలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్లు, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, మెడికల్ వంటి 13 విభాగాల్లో ర్యాంకులు ప్రకటించగా, అందులో మిట్స్‌కు ఈ గుర్తింపు దక్కినట్లు పేర్కొన్నారు. విద్యాబోధన ప్రమాణాలు, మౌలిక వస తులు, సౌకర్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకు లభించిందని వివరించారు. ఈ ఘనత సాధిం చడంలో సహకరించిన విద్యార్థులు, వారి తల్లిద ండ్రులు, అధ్యాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వ్యవస్థా పకులు, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి మాట్లాడుతూ ఇటీవలే మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందిన నేపథ్యంలో మరింత ఉత్సాహంతో కేవలం దేశంలోనే కాదు, ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు పొందే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్‌కుమార్ ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.



గుర్తింపు పత్రాన్ని చూపుతున్న వైస్ ఛాన్సలర్ యువరాజ్

10న 'విద్యా, ప్రజారోగ్యం'పై సెమినార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 10న నిర్వహించే సెమినార్ జయప్రదయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పెన్షనర్స్ జిల్లా కార్యాలయంలో సెమినార్ కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవన్‌లో సాయంత్రం ఐదున్నర గంటలకు 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రభుత్వ రంగ సంస్థలు విద్యా ప్రజారోగ్యం రంగాలపై ప్రభావం' అనే అంశం మీద సెమినార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధానవక్తగా ఎంపీ రాజ్యసభ ఆర్.శివదాసన్ హాజరవుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగాలపై విద్యా ప్రజారోగ్యాలపై వ్యవహరిస్తున్న తీరును ప్రజా రంగాలు, సంఘాలు ఎదుర్కోవలసిన విషయాలపై వివరిస్తారని పేర్కొన్నారు. ఎల్ఐసి నాయకులు రఘునాథ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జెవివి రాష్ట్ర కోశాధికారి బి.రాజశేఖర్ రాహుల్, యుఈఈయు రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఏపీ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర నాయకులు కె. జగదీశ్వర్ రెడ్డి, ఎల్ఐసి పెన్షనర్ నాయకులు కె.సుధకర్, ఏపీజీబీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షుడు నాగ ముని రెడ్డి, యుటిఎఫ్ నాయకులు సుజాత, వెంకటేశ్వర రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోదండరామయ్య కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలో పౌర్ణమి సందర్భంగా శ్రీ కోదండరాముడి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఇందులో పుణ్యాహవచనం నిర్వ హించారు. ఆ తరువాత రక్షాబంధనం, యజ్ఞోప వీతధారణ, వరప్రేశనం (కన్యావరణం), మధుపర్కార్చనం చేశారు. మహా సంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్నిప్రతిష్ఠాపన తరువాత సీతా రాముల తల మీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక నిర్వహించారు. తరువాత మంగళాష్టకం, చూర్ణిక పఠించి, మాంగళ్యసూత్ర పూజ, మంగళసూత్రధారణ, అక్షతారోపణం చేపట్టారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణఘట్టం పూర్తయింది. అంతకుముందు ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ ఎ. నవీన్ కుమార్, అర్చకులు, విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నదాతలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోందని, అవసరమైన సమయంలో ఎరువులు అందించడంలో వైఫల్యం చెందిందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహమ్మద్ విమర్శలు గుప్పించారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ పైన అన్నదాత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిస్సార్ మాట్లాడుతూ ఎరువుల బ్లాక్ మార్కెట్ పైన వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 9న రాయచోటిలో నిరసన కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేస్తామన్నారు. సకాలంలో రైతాంగానికి ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతాంగానికి సరైన మద్దతు లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మామిడి, టమోటా, అల్లనేరేడు రైతాంగానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టడులు సైతం అందక తీవ్ర నష్టానికి గురైయ్యారని వివరించారు. ఎన్నికలకు ముందు అధికారమే పరమావధిగా ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారన్నారు. టమోటా రైతాంగాన్ని ఆదుకుంటామని, పల్ప్ పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని ఎప్పుడు నేరవేరుస్తారని ప్రశ్నించారు. ఇప్పటికీ 14 నెలలు గడచిపోయాయి, మరో రెండేళ్ళకైనా ఆలోచన చేస్తారా అని ప్రశ్నించారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు పైన ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలన్నారు. రైతాంగం యూరియా కోసం నానాపాట్లు పడుతూ, ఒక్క బస్తా కోసం పడిగాపులు కాయల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపికి మద్దతుగా నిలిచిన రైతాంగానికి యూరియా ఇవ్వకుండా అధికారులపై వత్తిడి తెస్తున్నారన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరికి న్యాయం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా మారుస్తాం

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

ముఖా ముఖి..

ప్రజాశక్తి -రాయచోటి

ప్రజలకు అవగాహన కల్పించి అన్నమయ్య జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దుతామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో ఎక్సైజ్ కార్యాలయాలు వివరాలు, మద్యం పాలసీ అమలు, మద్యంలో ఎంత ఆదాయం వచ్చిందో, నాణ్యమైన మధ్యమును సరఫరా చేయించడం, నాటు సారాను ఎలా అరికట్టాల్లో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.



అన్నమయ్య జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు వివరాలు తెలియజేయండి?

జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఉంది. జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ స్టేషన్లున్నాయి.రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, మొలకలచెరువు, మదనపల్లి, వాయల్పాడు, పీలేరు, కోడూరు, రాజంపేట ప్రాంతాలలో ఉన్నాయి.

జిల్లాలో మద్యం షాపులు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 122 మద్యం షాపులున్నాయి. ఇప్పటి వరకు మద్యం షాపులు వల్ల జిల్లాకు సుమారు రూ .700 కోట్లు జిల్లాకు ఆదాయం వచ్చింది.

జిల్లాలో బార్లు, రెస్టారెంట్ల వివరాలు తెలియజేయండి?

జిల్లా వ్యాప్తంగా గతంలో 12 ఉన్నాయి. ప్రస్తుతం 3 బార్లు ఉన్నాయి. వాటికి ఈనెల 14 వరకు గడువు ఉంది.

ఓపెన్ బార్లకు దరఖాస్తులు ఎన్ని వచ్చినాయి?

జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లు, ఒక్క రిజర్వ్‌డ్ బార్లకు 34 దరఖాస్తులు వచ్చాయి. ఇటీవల కాలంలో కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో బార్లు కేటాయింపు లాటరీ డ్రా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మదనపల్లి డివిజన్‌లో మూడు బార్లు, రాయచోటిలో రెండు బార్లు , రాజంపేటలో రెండు బార్లు, కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్‌డ్ వారు సహనం మొత్తం 11 ఓపెన్ బార్లకు లాటరీ ద్వారా కేటాయించారు.

నాట సారాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నవోదయం 2.0 కార్యక్రమం కింద నాటు సారా వల్ల కలిగే దుష్ప్రభావాలను సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నాం. కలెక్టర్ శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో కలిసి అన్నమయ్య జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా స్థాయి కమిటీతో పాటు 71 గ్రామ స్థాయి కమిటీలు, 19 మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి నాటు సారా వల్ల కలిగే దుష్ప్రభావాలను, తయారీ, రవాణా, అమ్మడం వంటి వాటిపై చట్ట పరమైన శిక్షలు, వాటి పర్యవసానాల గురించి సంపూర్ణ అవగాహన కల్పించి జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా ఏకగ్రీవంగా ఆమోదించారు. కరపత్రాలు, గోడ పత్రాలు, కళాజాత బృందాల ద్వారా, హోర్డింగ్స్ ద్వారా నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేస్తాం.

ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు మొత్తం 126 మంది సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం సిబ్బంది కొరత ఏమి లేదు.

ప్రజలకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

జిల్లాలో మద్యం విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. నూతన మద్యం షాపులలో అన్ని రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఎవరు ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దు. నాట్ సారాకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న భరత్

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎంపిపి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బుర్రు సుబ్బరాయుడు ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన సుబ్బరాయుడును రాయలసీమ జోన్ బూత్ కమిటీ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి జ్ఞాపికను బహూకరించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి తమ సర్వీసు అనంతరం ఉద్యోగ విరమణ తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో గల్లా శ్రీనివాసులు, శ్రీను, సుబ్రహ్మణ్యం, లావులూరి ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి సహకారం

-సంఘం అధ్యక్షుడు హేమాచారి

ప్రజాశక్తి-కలికిరి

పంచముఖ విశ్వబ్రహ్మణ సంఘం అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హేమాచారి పిలుపునిచ్చారు. ఆదివారం హేమాచారి కల్యాణమండపంలో విశ్వబ్రాహ్మణ సంఘం మొదటి ప్రథమవార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అందరు సహకరించాలని , కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ నెల 17న సద్గురు శ్రీ విశ్వఖర్మ జయంతి కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సోదరులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మహేష్ఆచారి, ప్రధానకార్యదర్శి జయకుమార్, సంగసభ్యులు రత్నమాచారి, రుద్రచారి, సిద్దప్ప ఆచారి, రమేష్ఆచారి, బ్రబ్రమ్మచారి, రమణచారి, నాగరాజాచారి, మోహనచారి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మహమ్మద్‌రఫీ

ప్రజాశక్తి-సుండుపల్లి



మంత్రి లోకేష్‌తో మహమ్మద్ రఫీ

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు మండల మైనార్టీ నాయకులు మొహమ్మద్‌రఫీ పేర్కొ న్నారు. పార్టీ కోసం కష్టపడి చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని లోకేష్ చెప్పారని పేర్కొన్నారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారని తెలిపారు. కష్టపడిన వారిని పార్టీ గుర్తు పెట్టుకుంటుందని, అధైర్య పడ వద్దం టూ భరోసా కల్పించారని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-పుల్లంపేట



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ప్రభుత్వం వెంటనే ప్రయివేటీకరణను ఆపాలని బిఎస్‌పి రైల్వేకోడూరు ఇన్‌ఛార్జి, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు డాక్టర్ కావాలనే ఆశ కలగానే మిగిలి పోతుందన్నారు. రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లను ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీపరం చేయకుండా ఆపాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేయడం జరుగుతుందని తాళ్లపాక సుబ్రమణ్యం తెలియజేశారు.

టిప్పర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రామాపురం

టిప్పర్ డ్రైవర్ల సమస్యలను పరిశీలించాలని ఎఐసిసిటియు జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువులో ఆదివారం టిప్పర్ల డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. టిప్పర్లు డ్రైవర్లకు తక్కువ జీతం ఇవ్వడం చాలా దారుణమన్నారు. తక్షణమే టిప్పర్ల యాజమాన్యం డ్రైవర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నిరంతరం టిప్పర్లు డ్రైవర్లు రాత్రి అనక పగలనకా కుటుంబాలను వదిలేసి దూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేస్తూ చాలీచాలని జీతాలతో నానా అవస్థలు పడుతున్నానన్నారు. వెంటనే టిప్పర్ల డ్రైవర్లకు జీతాలు పెంచి పనికి తగ్గ బత్తా ఇవ్వాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా వెంకటరమణ, మండల కార్యదర్శిగా వి.మనోహర్. గౌరవ అధ్యక్షులుగా మావులూరి విశ్వనాద ఉపాధ్యక్షులుగా ఎం.సెల్వ నిత్యపూజ, కోశాధికారిగా శశికుమార్ సహాయకార్యదర్శిగా జి.రామక్రిష్ణ. కమిటీ సభ్యులుగా ఓబులేసు, చంద్రశేఖర్ రామక్రిష్ణ మహేష్ మహేంద్రతో 15 మంది సభ్యులతో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.

రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-చిన్నమండెం : మండల కేంద్రం చిన్నమండెం బస్టాండ్ సమీపంలో చిన్నర్సుపల్లెకు చెందిన లోకేష్ బాబు ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ కిచెన్స్ రెస్టారెంట్‌ను ఆదివారం రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప, సాం ప్రదాయ బద్ధంగా ఎమ్మెల్యేకి స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలం కరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అక్ర మ కేసులు నిలబడవని చివరకు న్యాయమే గెలుస్తుందన్నారు.ఆయన వెంట నాయకులు చౌడేశ్వర్,నారాయణరెడ్డి,మల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కరీం పాల్గొన్నారు.



మల్లయ్య కొండను సందర్శనకు వెళుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఖాతాదారులకు మరిన్ని సేవలు



మహాజన సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విద్యాసాగర్

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ది మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్101వ వార్షిక మహజన సభ సమావేశం ఆదివారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. జరిగింది. ఈ సమావేశానికి బ్యాంకు చేర్మేన్ నాదెళ్ల విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో 2024-2025 ఆర్థిక సంవత్సర నివేదిక సమర్పించారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు యొక్క డిపాజిట్లు రూ.91.66 కోట్లు కాగా ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలు రూ.66.86 కోట్లు గా ఉన్నాయన్నారు. సభ్యుల వాటాధనం రూ.2.31 కోట్లు, బ్యాంకు వ్యాపార సొమ్ము రూ.112.84 కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. సభ్యులకు 10 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు వారు ఇటీవల బ్యాంక్ కు మొబైల్ బ్యాంకింగ్, యుపిఐ చెల్లింపులైన గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం సదుపాయం కల్పించుటకు అనుమ తించారని, త్వరలోనే ఈ సదుపాయంలు బ్యాంకు ఖాతాదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు వ్యాపార పరిధిని ప్రస్తుత ఉన్న పరిధి నుంచి సమీప జిల్లాలైన చిత్తూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలు మొత్తం విస్తరించే విధంగా ప్రతి పాదనలు పంపడం జరిగిందని అన్నారు. త్వరలోనే దీనికి అనుమతి లభిస్తుదని తెలిపారు. బ్యాంక్ శత వార్షిక సంబరాలు అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ భాస్కర్ కుమార్, డైరెక్టర్స్ ఎస్.రవీంద్రనాథ్ ఎన్. ముక్తియార్ ఖాన్, ఆర్. సోమమేఖర్, నాదేళ్ళ వెంకటేశ్వర ప్రసాద్(శివ) ఆకుల కష్ణమూర్తి, జోశపాళెం దేవేంద్ర, పి.సర్దారన, ఆర్. భాస్కర్, వి.నరంజన్ ప్రొఫైసినల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, విజయ కుమార్ ఖాతాదారులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిజెపి దొంగోఓట్ల రాజకీయానికి నిరసన తెలియజేస్తూ ఓట్ చోర్.. ఘద్దీ చోడ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మదనపల్లె సీనియర్ కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్ తెలిపారు. పట్టణంలో ఎన్ఎస్‌యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సి.సాయిసంపత్ ఆధ్వర్యంలో సేకరించిన పోస్ట్ కార్డులను ఆదివారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం నుంచి పోస్టు ద్వారా రాష్ట్రపతికి పంపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ రెడ్డి సాహెబ్ మాట్లాడుతూఎఐసిసి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా పోస్ట్ కార్డులు సేకరించి రాష్ట్రపతికి పంపించే క్రమంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సేకరించిన పోస్ట్ కార్డులను రాష్ట్రపతి కి పంపుతున్నామని చెప్పారు. ఇసితో కలిసి కేంద్ర ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడు తుందని, దేశం యావత్తు ప్రజలకు తెలిసిపో యిందన్నారు. ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ మేలుకొల్పే విధంగా వివిధ కార్య క్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంపత్, రాష్ట్ర కార్యదర్శి తేజ, మదనపల్లె కాంగ్రెస్ పార్టీ టౌన్ మాజీ కార్యదర్శి మహమ్మద్ అలీ, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



పోస్టుకార్డులను పోస్ట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చట్టాలపై అవగాహనతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న న్యాయవాది ఈశ్వర్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాజ్యాంగం పైన, చట్టాల పైన అవగాహన ఉన్నప్పుడే అణగారిన వర్గాలు ఎవరైనా తమ హక్కులను సాధించు కోగలరని భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలో వడ్డెర విద్యావంతుల వేదిక ప్రతి నిధుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వర్ మాట్లాడుతూ బండరాళ్లను పిండి చేసి ఈ సమాజానికి కావలసిన నివాసాలను, అన్ని రకాల నిర్మాణాలను నిర్మించే వడ్డెరలు అన్ని రంగాలలో వెనకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరలు అభివృద్ధిలోనికి రావాలంటే రాజ్యాంగం కల్పించిన హక్కులపైన , చట్టాల పైన పూర్తి అవగాహన కలిగి ఉండాలని అప్పుడే హక్కు ల సాధన సాధ్యమ వుతుందన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో చైత న్య విద్యా సంస్థల ఎజిఎం దేరంగుల రమణయ్య మా ట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరలు సుమారు 50 లక్షల వరకు ఉండగా 175 మంది ఎమ్మె ల్యేలలో ఒక్క వడ్డెర కూడా లేకపోవడం బాధించే విషయమని పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి కూడా వడ్డెర కులా నికి చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా ఇప్పటివరకు అసెంబ్లీలో అడుగుపెట్టిన సందర్భం లేద న్నారు. వడ్డెర కులం వెనుకబాటు తనానికి ఇంతకు మించిన నిదర్శనం ఏమి అవసరం లేదని అన్నారు. పేమ్మాడపల్లి సర్పంచ్ పల్లపు వాసు మాట్లాడుతూ వడ్డెరలకు రాజ కీయ ప్రాధాన్యత కల్పించినప్పుడే అభివృద్ధి లోకి వస్తారన్నారు. కార్యక్రమంలో ఎపి వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీ నర్ చంద్రశేఖర్, జీవా నందం, జిల్లా కార్యదర్శి మారుతి శంకర్ , న్యాయవాదులు నాగ ముని, నాగార్జున, శివప్రసాద్ వీరభద్ర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు కోటకొండ రవి శంకర్, వేదిక ఉపాధ్యక్షులు చల్లా రెడ్డయ్య బివి రమణ, రామకృష్ణ, చిన్నప్ప పాల్గొన్నారు.

12 నుంచి ఎఐఎస్‌బి జాతీయ మహాసభలు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

కడప నగరం వేదికగా ఈనెల 12 నుంచి 14వ అఖిల భారత విద్యార్థి బ్లాక్ 9వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, రాయలసీమ జిల్లాల కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలను ఆదివారం రాయచోటిలోని బిసి హాస్టల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి సంఘాల పాత్ర చాలా కీలకమై నదన్నారు. విద్యారంగ సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల విధానాల పట్ల విద్యార్థి సంఘాల పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థి సంఘాలు విద్యా సంస్థలకు విద్యార్థులకు ప్రభుత్వాలకు మధ్య వారధిలా పనిచేస్తూ నిత్యం విద్యారంగ సమస్యల పట్ల సమస్యల పోరాటాలు నిర్వహిం చడం హర్షణీ యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ విద్యకు ప్రోత్సాహం అందిస్తు న్నారన్నారు. దేశంలో కార్పొరేటీకరణ కాషాయకరణ ప్రైవేటీకరణ ముందుకు సాగుతు న్నాయని, ప్రభుత్వ యూనివర్సిటీలను ప్రైవేటుపరం చేస్తూ నరేంద్ర మోడీ సర్కార్ కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.జాతీయ మహాసభలలో విద్యారంగ సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువకుల కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటూ ముందుకు సాగడానికి జాతీయ మహాసభలు ఎంతగానో దోహద పడతాయని వారు తెలిపారు. కార్యక్ర మంలో ఎఐఎస్‌బి నాయకులు అఖిల్,ప్రణయ్, కిరణ్, సుశాంత్ పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎఐఎస్‌బి నాయకులు

కార్యకర్తల సంక్షేమానికి కృషి :'చమర్తి'



చమర్తిని సన్మానిస్తున్న కూచివారి పల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని కూచివారిపల్లి గ్రామం టిడిపికి కంచుకోట అని, అలాంటి గ్రామానికి, గ్రామ ప్రజలకు, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట టిడిపి కార్యాల యంలో కూచువారిపల్లి గ్రామస్తులు చమర్తిని ఘన ంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు హాజరై కూటమి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. సమర ్థవంతమైన నాయకుడిని అధిష్టానం నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నిర్ణయించడం అభినందనీయమన్నారు. చమర్తి ఆధ్వర్యంలో రాజంపేటలో టిడిపి విజ యానికి మరింతగా కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం జగన్మో హన్‌రాజు మాట్లాడుతూ టిడిపికి అండగా ఉన్న ప్రతి గ్రామాన్ని, ప్రతి నాయ కుడిని, ప్రతి కార్యకర్తను సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటామని, కూచివారిపల్లి గ్రామ ప్రజలు నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాజంపేట నియో జకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరిని కలుపుకుని పోయి టిడిపి జెండా ఎగరవే సేందుకు శక్తివంతం లేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో కూచివారిపల్లి నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా దండు గోపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా దండు గోపిని నియమిస్తూ ఆదివారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా దండు గోపి వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసంతో తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోను, సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసిపి విజ యానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి విశ్వనాథరెడ్డి, నాయకులు బొజ్జ పెంచలయ్య పాల్గొన్నారు.



అనిల్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దండు గోపి



ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

మదనపల్లెలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణ ప్రజలకు రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు అధికమవుతున్నాయి. పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, మల్లికార్జున సర్కిల్, బెంగుళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఉండే ఓ షాపింగ్ మాల్‌కు కొనుగోలు దారులు అధిక సంఖ్యలో రావడం, షాపింగ్‌మాల్‌కు పార్కింగ్ లేక పోవడంతో వాహనాలు ఇరు వైపులా అడ్డగోలుగా నిలిపి వేశారు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంబించిపోయింది. సిటియం రోడ్డులోను ఇటీవల ప్రారంభించిన షాపింగ్ మాల్ ప్రాంగణంలో ఇదే సమస్య ఉంది. పోలీసులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డును చదును చేస్తున్న జెసిబి

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లి నుంచి రాయచోటికి వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును ఎవ్వరూ పట్టించుకోలేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదని ప్రజలు పేర్కొన్నారు. పరిస్థితిని గమనించిన రాయవరం సర్పంచ్ షరీఫ్ మాన తత్వం చాటుకొని సుండుపల్లి నుంచి రాయచోటికి వెళ్లే రహదారిలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును తన సొంత డబ్బులతో గుంతలు ఉన్న రోడ్లను జెసిబి సహాయంతో ఆ రోడ్డు మరమ్మతు పనులను చేయించారు. వాహనదారులు, ప్రజల ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి రోడ్డుకు మరమ్మతు చేయించిన షరీఫ్‌ను ప్రజలు అభినందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో ఆస్టర్ నారాయణాద్రి రేణిగుంటవారి సౌజన్యంతో రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కొత్త మంగంపేటలో మెగా వైద్య శిబిరంలో నారాయణద్రి వైద్య సిబ్బంది రోగులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మంగంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వందలాదిగా వచ్చి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో లావులూరి ప్రభాకర్, గల్లా శ్రీనివాసులు, శ్రీను, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.



లడ్డూను దక్కించుకున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

రూ.1.93లక్షలు పలికిన లడ్డూ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని రెడ్డిస్‌కాలనీలో ఉన్న రామాలయం వద్ద అగ్రగామినే గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో రూ.1.93లక్షలకు మద్దిరేవుల రెడ్డిశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అభినందించి సన్మానించారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య వినాయక లడ్డూను మద్దిరేవుల రెడ్డిశేఖర్ రెడ్డి ఊరేగింపుగా తన నివాసానికి తీసుకెళ్లారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో వినాయక విగ్రహం వద్ద మహిళలు కుంకుమార్చన, సరస్వతి, దుర్గమ్మ పూజలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అక్కడ నిర్వహి ంచిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో వినాయక విగ్రహా న్ని నిమజ్జన కార్యక్రమానికి ఊరేగింపుగా తరలించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ మదనకుమార్, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇంటిలోకి దూసుకెళ్ళిన కారు

రూ. 2 లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



కారు ఇంట్లోకి తీసుకెళ్లడంతో ధ్వంసమైన ఫర్నిచర్

హార్సిలీ హిల్స్ వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్ళడంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఆదివారం కురబలకోట మండలంలో జరిగిన ఘటనపై బాదితులు తెలిపిన వివ రాల మేరకు.. పలమనేరుకి చెందిన కొందరు యువకులు ప్రముఖ పర్యాటక కేంద్రం, హార్సి లీహిల్స్‌కు కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలోని కంటేవారిపల్లె వద్ద చేరుకున్న కారు అదుపుతప్పి గ్రామానికి చెందిన మనోహర్ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో, ఇంటి ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు, ఒక బైక్, సుమారు రెండు లక్షలకు పైగా విలువచేసే మట్టి కుండలు ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో రేకుల షెడ్డులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణాపాయం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



గాయపడిన లియాకత్ అలీ

రోడ్డు పక్కన నిలబడి ఉన వృద్ధుని కారు ఢీకొనడంతో తీవ్రం గా గాయ పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. స్థానిక అమ్మచెరువు మిట్ట ఎసి గోడౌన్ సమీపంలో నివాసముంటున్న లియాకత్ అలీ సొంత పనిపై పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రింగ్ రోడ్డు వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన నిలబడి ఉండగా, అటుగా వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి వృద్ధున్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.